AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

29-9-2026 (Tuesday) MAIN EDITION

అక్టోబర్ 10 నుంచి దసరా సెలవులు



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : తెలంగాణ ప్రభుత్వం దసరా సెలవులపై ప్రకటన చేసింది. బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ఈ ఏడాది 13 రోజులు సెలవులు ఇచ్చింది. అక్టోబర్ 20న దసరా పండుగ జరగనుంది. దీంతో ప్రభుత్వం పాఠశాలలకు అక్టోబర్ 10 (శనివారం) నుంచి 22 (గురువారం) వరకు సెలవులు ప్రకటించింది. 13 రోజుల పాటు పాఠశాలలు బంద్ ఉండనున్నాయి. అక్టోబర్ 23న బడులు తిరిగి ప్రారంభం అవుతాయి.

ట్రాప్ షూటింగ్‌లో భారత్‌కు రజతం



అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : ఆసియా క్రీడల్లో పదో రోజు భారత్ షూటర్లు సత్తా చాటారు. మహిళా ట్రాప్ షూటింగ్ విభాగంలో రజత పతకం గెలుచుకున్నారు. భారత త్రయం నీరూ దండా (118), ఆషిమా అహ్లావత్ (106), మనీషా కీర్ (104) సంయుక్తంగా 328 స్కోరు చేశారు. దీంతో సిల్వర్ మెడల్ దక్కించుకున్నారు. ఇదే విభాగంలో పురుషుల జట్టు పతకం సాధించలేకపోయింది.

యూనివర్సిటీ నుంచే ఎమ్మెల్యేగా గెలిచా



అక్షరటుడే, ఏపీ: యూనివర్సిటీ నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచానని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. విద్యుత్ లేని గ్రామంలో జన్మించి.. విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చానని చెప్పారు. నేడు టెక్నాలజీ పెరగడంతో ఏడెనిమిదేళ్ల పిల్లలు కూడా పాడ్‌కాస్ట్‌లు చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారని పేర్కొన్నారు.

జ్ఞానేష్ కుమార్‌పై విపక్షాల మరో ప్లాన్..!



అక్షరటుడే, ఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలంటూ ప్రతిపక్షాలు మరోసారి దూకుడు పెంచాయి. పార్లమెంట్‌లో తొలగింపు నోటీసు ఇవ్వడానికి సమాయత్తమవుతున్నాయి. జ్ఞానేష్ కుమార్‌పై విపక్షాలు నోటీసు ఇవ్వడం ఇది మూడోసారి కావడం గమనార్హం.

పాలిటిక్స్‌లోకి ఎంట్రీ ఇచ్చిన మాజీ కలెక్టర్



అక్షరటుడే, యూపీ : ఉత్తరప్రదేశ్ కేడర్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారిణి దివ్య మిట్టల్ రాజకీయ రంగప్రవేశం చేశారు. తన 13 ఏళ్ల సుదీర్ఘ సర్వీస్‌కు గత నెలలో రాజీనామా చేసిన ఆమె, తన భవిష్యత్ రాజకీయ ప్రయాణంపై స్పష్టతనిచ్చారు. ప్రజా సేవలో కొనసాగనున్నట్లు వీడియో విడుదల చేశారు.

అమెరికా సైన్యానికి సైబర్ షాక్..



అక్షరటుడే, నేషనల్ డెస్క్: ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా పేరున్న అమెరికా రక్షణ శాఖ పెంటగాన్‌కు సైబర్ భద్రతా విభాగంలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. పెంటగాన్‌కు చెందిన కీలకమైన డేటాబేస్‌లోకి హ్యాకర్లు అక్రమంగా చొరబడి, సుమారు 30 లక్షల మందికి పైగా సిబ్బంది వ్యక్తిగత వివరాలను తస్కరించినట్లు వెల్లడైంది. సైనిక బలగాల సమాచారాన్ని భద్రపరిచే డిఫెన్స్ మ్యాన్‌పవర్ డేటా సెంటర్ సిస్టమ్‌లోకి సైబర్ నేరగాళ్లు చొరబడి ఏకంగా తొమ్మిది నెలల పాటు ఎవరికీ అనుమానం రాకుండా అందులోనే తిష్టవేశారు.

మహిళలపై వేధింపులు ఆపాలి : రాహుల్ గాంధీ



అక్షరటుడే, ఢిల్లీ : మహిళలపై వేధింపులు ఆపాలని, వారిని స్వేచ్ఛగా ఉండనివ్వాలని రాహుల్ గాంధీ అన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలు రోడ్లపై నడవాలంటే భయపడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల భద్రత కోసం వేలాది మంది విద్యార్థులు, యువత రోడ్లపైకి వచ్చారన్నారు. దేశవ్యాప్తంగా యువతులు నిరసనల్లో పాల్గొనాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచితేనే ప్రజల సమస్యలను పట్టించుకుంటుందని పేర్కొన్నారు.

నాతో పెట్టుకోవద్దు..

- కేటీఆర్‌కు కవిత వార్నింగ్
- ఆంధ్ర దోస్తులకు నజరానాలు ఇచ్చారని ఆరోపణ
- పార్టీకి గోతి తవ్వుతున్నారని విమర్శలు



భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత కవిత ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే ముఖ్యమంత్రి అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదంటూ కేటీఆర్ చేసిన కామెంట్స్‌పై ఆమె మండిపడ్డారు. పార్టీలో తన వైఫల్యాన్నంతా అధినేత కేసీఆర్‌పై రుద్దాలని చూస్తున్నారని ఆరోపించారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

కూర్చున్న కొమ్మను నరుక్కున్నట్టుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. పార్టీలో తన చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునేందుకు అధినేతను తప్పపట్టడం సరైన పద్ధతి కాదన్నారు. గుంటనక్క మైండ్ గేమ్‌లో పడి పెద్ద మనిషినే బాధ్యుడిని చేస్తూ బీఆర్ఎస్ పార్టీకి గోతి తవ్వుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. తాను గతంలో పార్టీలో ఉన్నప్పుడు ఒక అవినీతిపరుడిని విమర్శిస్తే గంటల్లోనే సస్పెండ్ చేశారని, కానీ ఇప్పుడు అదే వర్గంతో అంటకాగుతూ కేసీఆర్ విధానాల వల్లే నష్టపోయామని చెప్పడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు.

క్విడ్ ప్రో కో దందాలపై విమర్శలు..

పార్టీని పాతాళంలోకి నెట్టింది ఎవరో ఆత్మపరిశీలన చేసుకోవాలని కవిత హితవు పలికారు. ఫామ్ హౌస్‌లు, అక్రమ అనుమతులు, ఆంధ్రా దోస్తులకు కట్టబెట్టిన నజరానాలు, క్విడ్ ప్రో కో దందాలతో పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టింది కేటీఆరేనని ఆరోపించారు. ఇటీవల జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో ఒక రైతు ఫోన్ మాట్లాడుతుంటే అతని భార్యను కించపరిచేలా మాట్లాడారని, ఒక మహిళ సాయం కోరి వస్తే దురుసుగా ప్రవర్తించారని మండిపడ్డారు.

ఆధారాలు ఉన్నాయి

నిమజ్జనోత్సవ వేళ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను బతిమాలుకున్న విషయాలు ఆ గణేష్ మహారాజుకు, వారి అంతరాత్మకే తెలుసని కవిత పేర్కొన్నారు. తాను ఎవరి మాటలు వినో, కేవలం గాలి మాటలో మాట్లాడడం లేదని, తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా "నాతో పెట్టుకోవద్దు" అంటూ ఆమె ఘాటుగా హెచ్చరించారు.



స్వర్ణం గెలిచిన నీరు దండా

అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : ఆసియా క్రీడల్లో భారత్ మరో స్వర్ణం గెలిచింది. ట్రాప్ షూటింగ్ వ్యక్తిగత విభాగంలో నీరు దండా మంగళవారం గోల్డ్ మెడల్ గెలుచుకుంది. ఫైనల్‌లో చైనా క్రీడాకారిణి సున్ యునాంగ్ కంటే మెరుగైన ప్రదర్శనతో నీరు మొదటి స్థానంలో నిలిచింది. దీంతో భారత్ ఖాతాలో ఐదు స్వర్ణాలు చేరాయి. షూటింగ్‌లో ఇదే తొలి గోల్డ్ మెడల్ కావడం గమనార్హం. హర్యానాకు చెందిన నీరు దండా ఈ ఏడాది సూపర్ ఫామ్‌లో ఉంది. ఇటలీలో జరిగిన షాట్‌గన్ ప్రపంచ కప్‌లో ట్రాప్ ఈవెంట్‌లో ప్రపంచ కప్ స్వర్ణ పతకం గెలుచుకుంది.

మండుతున్న ఎండలు

అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మధ్యాహ్నం వేళ తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రానున్న 5 రోజులు ఎండలు మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తూర్పు, దక్షిణ తెలంగాణలో ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు దాటే అవకాశం ఉంది. హైదరాబాద్‌తో సహా మిగిలిన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 35-36 డిగ్రీల వరకు చేరవచ్చు. అక్టోబర్ 2 తర్వాత కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది.





సంభల్ హింసాకాండ కేసు.. సుప్రీం కీలక వ్యాఖ్యలు

అక్షరటుడే, ఢిల్లీ : సంభల్ హింసాకాండ కేసులో ఎన్ఎస్ఏ చట్టం కింద నిందితుడిని నిర్బంధించారు. దీనిని మంగళవారం సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఉత్తర ప్రదేశ్‌లోని సంభల్‌లో షాహీ జామా మసీదు సర్వే నేపథ్యంలో 2024 నవంబర్ 24న హింస చెలరేగింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా.. 20 మంది భద్రతా సిబ్బంది గాయపడ్డారు. యూపీ ప్రభుత్వం అఫ్రోజ్‌ను 2025 అక్టోబర్‌లో కఠినమైన ఎన్ఎస్ఏ చట్టం కింద అరెస్ట్ చేసింది. దీనిపై అతడు సుప్రీంను ఆశ్రయించగా.. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగులతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. నిందితుడి నేరాంగీకార వాంగ్మూలం ఆధారంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ముందస్తు నిర్బంధ ఉత్తర్వులు జారీ చేయలేదని పేర్కొంది.


రైలు ఢీకొని 100 గొర్రెలు మృతి

అక్షరటుడే, మేడ్చల్ : మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాక్‌పై ఉన్న గొర్రెలను రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో 100 గొర్రెలు మృతి చెందాయి. ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలోని ఔషాపూర్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున గొర్రెలను రైలు ఢీకొంది. కేపాల్ వద్ద రైల్వే పట్టాల సమీపంలో కాపరి గొర్రెలను మంద పెట్టి పడుకున్నాడు. అయితే తెల్లవారుజామున రైలు శబ్దానికి గొర్రెలు భయపడి పట్టాలపైకి పరుగులు తీసినట్లు సమాచారం. అదే సమయంలో కాజీపేట నుంచి హైదరాబాద్ నాంపల్లికి వెళ్తున్న దక్షిణ ఎక్స్‌ప్రెస్ గొర్రెలను ఢీకొంది. ఈ ప్రమాదంలో 100కు పైగా గొర్రెలు చనిపోయాయి.



ఆ పోలీసులను గుర్తించండి : హైకోర్టు

అక్షరటుడే, హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ దగ్గర ఘటనపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా ఎమ్మెల్యేలతో అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించాలని డీజీపీని ఆదేశించింది. అసెంబ్లీ ఘటనపై బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ పోలీసులను గుర్తించాలని ఆదేశించింది. పోలీసులపై చర్యలకు రిపోర్టు స్పీకర్ ముందు ఉంచాలని డీజీపీకి సూచించింది. ఒకవేళ స్పీకర్ ఆదేశాలతో పోలీసులు అలా వ్యవహరించి ఉంటే అది స్పీకర్ అధికార పరిధిలోకి వస్తుందని న్యాయస్థానం పేర్కొంది.



నిమ్స్ డాక్టర్ అక్రమాస్తుల కేసు.. బార్బర్ ఇంట్లో రూ.7 లక్షల నగదు

అక్షరటుడే, హైదరాబాద్ : నిమ్స్ ఆసుపత్రి సీనియర్ అధికారి డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై ఏసీబీ అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల ఆయన నివాసాల్లో సోదాలు చేసి భారీగా అక్రమాస్తులు గుర్తించారు. కేసు విచారణలో భాగంగా మంగళవారం ఉదయం నిమ్స్ ఉద్యోగులకు చెందిన ఐదు ఇళ్లలో సోదాలు చేపట్టారు. ఆస్పత్రిలో బార్బర్‌గా పనిచేస్తున్న ధన్‌రాజ్ వద్ద రూ. 7 లక్షల నగదు లభ్యమైంది. అంతేగాకుండా ఉద్యోగుల నివాసాల్లో భూమికి సంబంధించిన పత్రాలు, నగదు లావాదేవీల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

